సాక్షి
హనుమకొండ
బుధవారం | 26 | ఏప్రిల్ | 2023



ఘనంగా కల్యాణం

వరంగల్ భద్రకాళి దేవాలయంలో శ్రీభద్ర కాళిభద్రేశ్వరుల కల్యాణం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. - 8లో▸



నిట్‌లో కొలువుల సంబురం

నిట్‌లో కొలువుల సంబురం మంగళవారం నిర్వహించారు. కాలేజీకి చెందిన 1,410 మంది విద్యార్థులు 268 కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$36^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

కన్నీరే మిగిలింది

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు

- చేతికొచ్చే సమయంలో నేలపాలు
- తీవ్రంగా నష్టపోయిన రైతులు
- పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకోలు

జిల్లాలో వరుసగా కురుస్తున్న ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన రైతులను కోలుకోలేని దెబ్బతీస్తోంది. ఇప్పటికే కురిసిన వానతో చేతికొచ్చిన పంట నేలపాలైంది. మొక్కజొన్న, వరి నేల వాలి పనికిరాకుండా పోయింది. కొన్నిచోట్ల కోత కోసి ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిపోయింది. మరికొన్నిచోట్ల కొట్టుకుపోయింది. వేలకు వేలు అప్పు చేసి పెట్టుబడులు పెట్టామని, చేతికాడి కూడును వడగళ్ల వాన ఎత్తుకుపోయిందని పలువురు రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు మండలాల్లో తీవ్రంగా నష్టపోయిన రైతులను 'సాక్షి' మంగళవారం పలకరించింది. వారు తమ కష్టనష్టాలను ఏకరువు పెట్టారు. – సాక్షి నెట్‌వర్క్

ఫోకస్ సాక్షి ఫోకస్



దామెర: మండల కేంద్రానికి చెందిన హింగె నర్సింగరావు రెండెకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న చేను వేశాడు. పంట చేతికివచ్చే సమయానికి ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పూర్తిగా నేలవాలింది. ఎకరానికి రూ.70వేల చొప్పున రెండెకరాలకు రూ.1.40లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతు కన్నీరుమున్నీరవుతున్నాడు. తనను అన్ని విధాలుగా ఆదుకోవాలని అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నాడు.



కమలాపూర్‌లో గాలివానకు నేలవాలిన మొక్కజొన్న చేను

● మొక్కజొన్న పాడైంది



కమలాపూర్: మండల కేంద్రానికి చెందిన రైతు రాంశెట్టి మల్లయ్య తనకున్న మూడెకరాల భూమిలో ఎకరంన్నర మొక్కజొన్న, ఎకరంన్నర వరి పంట సాగు చేశాడు. మొక్కజొన్న ఎకరా ఒక్కంటికి రూ.25వేలు, వరి ఎకరా ఒక్కంటికి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. మొక్కజొన్న పంట ఇప్పుడిప్పుడే పాలు పోసుకుంటోంది. ఇంకో 15 రోజుల్లో పంట చేతికొస్తుందన్న దశలో కురిసిన అకాల వర్షం, వడగళ్ల వానకు మొక్కజొన్న చేనంతా విరిగిపోయింది. వరి గింజ మొత్తం రాలిపోయింది. దీంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవు. అకాల వర్షం, వడగళ్ల వానతో మొక్కజొన్న, వరి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.40 వేల చొప్పున పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని మల్లయ్య వేడుకుంటున్నాడు.

● కొట్టుకుపోయిన వడ్లు



ధర్మసాగర్: వేలేరు మండలం బండతండాలో మూడు రోజుల క్రితం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి ఆరబోసిన వడ్లు కొట్టుకుపోయాయి. తండాకు చెందిన భూక్యా లత మూడు ఎకరాల వరిసాగు చేసింది. ఇటీవల కోతకోసి ధాన్యాన్ని బండమీద ఆరబోసింది. ఎండలు తీవ్రంగా ఉండడంతో వడ్లు కుప్ప చేయకుండా అలాగే ఉంచింది. మూడు రోజుల క్రితం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి వడ్లు మొత్తం తడిసిపోయాయి. దాదాపు 10 బస్తాలపైనే వడ్లు కిందికి కొట్టుకుపోయాయి.



దెబ్బతిన్న వెంకట్‌రెడ్డి వరిచేను



ఎల్కతుర్తి: మండల కేంద్రానికి చెందిన కొమ్మిడి వెంకట్‌రెడ్డి తనకున్న నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాడు. భారీగా పెట్టుబడి పెట్టాడు. గత శనివారం కురిసిన అకాల గాలివాన బీభత్సానికి చేతికంది వచ్చిన వరిపంట పూర్తిగా దెబ్బతిని వడ్లు నేలరాలిపోయాయి. 'వారం రోజుల్లో వరిపంటను కోద్దామనుకున్న, శనివారం కురిసిన అకాల గాలివానకు పంట పూర్తిగా దెబ్బతినడంతో పాటు వడ్లు నేలరాలిపోయి తీవ్ర నష్టం వాటిలింది ప్రభుత్వం, అధికారులు స్పందించి పంటనష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి' అని రైతు వెంకట్‌రెడ్డి వేడుకుంటున్నాడు.

● పెట్టుబడి కూడా రాదు..



ఆత్మకూరు: కటాక్షపూర్‌కు చెందిన రైతు తిప్పారపు కిషన్‌రావు రెండు ఎకరాల్లో వరిసాగు చేశాడు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట మొత్తం నేలవాలింది. దీంతో పనికిరాకుండా పోయింది. పొట్టకొచ్చిన వరి నేలమీద పడిపోయింది. కొద్ది రోజులైతే పంట చేతికొస్తుందనుకుంటే అకాలవర్షంతో కోలుకోలేని దెబ్బ తగిలిందని రైతు కిషన్‌రావు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రూ.50వేలు పెట్టుబడి పెట్టానని, ఇప్పుడు అప్పు ఎలా తీర్చాలంటూ మదన పడుతున్నాడు.

● పరిహారం అందించి ఆదుకోవాలి



శాయంపేట: మైలారం గ్రామానికి చెందిన జక్కుల సురేష్ తన రెండు ఎకరాల వ్యవసాయ భూమికి తోడు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. మొత్తం నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశాడు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి మూడు ఎకరాల వరి పంట నేలవాలింది. ప్రభుత్వం తక్షణమే ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.

● చేతికందే టైమ్‌లో..



ఆత్మకూరు: ఈ ఫొటోలో ఉన్న రైతు ఎరుకల రమణ, ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామం. 3 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేసిండు. రూ.70వేలు అప్పుచేసి పెట్టుబడి పెట్టిండు. చేతికందే సమయంలో అకాలవర్షాలకు పంట నేలవాలి పాడైంది. 'గతంలోనే అకాలవర్షాలకు పంట దెబ్బతిన్నది. ఈసారైనా బాగుంటుందేమో అనుకుంటే మళ్లీ వడగళ్ల వాన కొంప ముంచింది' అని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

● మొక్కజొన్న నేలమట్టం



నడికూడ: రామకృష్ణపూర్ గ్రామానికి చెందిన పెండ్లి లింగయ్య తన రెండు ఎకరాల్లో మొక్కజొన్న వేయగా ఇటీవల కురిసిన ఈదురు గాలులతో కూడిన అకాల వర్షంతో నేల పాలైంది. రూ.70 వేల వరకు పెట్టుబడి పెట్టానని, పెట్టిన పెట్టుబడి కూడా రాలేని పరిస్థితి ఉందని రైతు లింగయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

వానొచ్చే...వరదొచ్చే



హనుమకొండలోని ఓ వీధిలో నిలిచిన వరద

వరంగల్ అర్బన్: నగరంలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన వర్షానికి పలు రహదారులు వరదతో నిండిపోయాయి. మోకాల్లోతు మురుగుతో కూడి ఉన్న వరదలో వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. నగరంలోని పలు ప్రధాన రహదారుల్లో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక, పూడికతీత పనులు చేపట్టకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. వరంగల్ హెడ్ పోస్టాఫీస్, స్టేషన్ రోడ్డు,మహేశ్వరీ గార్డెన్, బీట్ బజార్, పోచమ్మమైదాన్ జంక్షన్, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయం, హనుమకొండ ప్రాంతంలోని ములుగు రోడ్డు, చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచింది.

భూ వివాదంలో హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్‌పై వేటు

నరేందర్ ఏఆర్‌కు అటాచ్

వరంగల్ క్రైం: భూ వివాదాల్లో జోక్యం చేసుకున్న హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌ను ఏఆర్‌కు అటాచ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతంపేట భూమి విషయంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించడంతోపాటు స్పెషల్ బ్రాంచీ అధికారులకు నిజం చెప్పాడనే కారణంతో ఓ వ్యక్తిని ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరింపులకు పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్ సురేందర్‌పై ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఇరువర్గాలతో మాట్లాడిన సీపీ.. వాస్తవమని తేలడంతో హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ నరేందర్‌ను ఏఆర్‌కు అటాచ్ చేశారు. సీతంపేట భూమి యజమాని గిన్నారపు దేవేందర్ కెన్యాలో ఉండగా ఆయన ఈ వివాదంపై సీపీకి ట్విటర్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితులనుంచి ఇన్‌స్పెక్టర్ రూ.10లక్షలు డిమాండ్ చేసినట్లు తెలిసింది. అయితే కబ్జాకు దిగిన వ్యక్తులు వడ్డెపల్లికి చెందిన తాళ్లపల్లి సునిల్ అనే వ్యక్తి ద్వారా రూ.50వేలు ముట్టచెప్పారు. ఈ విషయం బాధితులు సీపీకి ఫిర్యాదు చేయడంతో ఆయన స్పెషల్ బ్రాంచీ అధికారుల ద్వారా విచారణ చేయించారు. సునీల్.. స్పెషల్ బ్రాంచ్ అధికారులకు విషయం చెప్పాడని అతన్ని పిస్టల్‌తో బెదిరించాడు. ఇన్‌స్పెక్టర్‌పై వచ్చిన ఆరోపణలన్నీ వాస్తవమని తేలడంతో ఏఆర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మరో ఇన్‌స్పెక్టర్‌పై విచారణ?

హనుమకొండ సబ్ డివిజన్ పరిధిలోని భూ వివాదాలకు కేరాఫ్‌గా నిలుస్తున్న ఓ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌పై కొంత మంది బాధితులు ఇప్పటికే సీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అతనిపై కూడా విచారణ సాగుతున్నట్లు సమాచారం.

న్యూస్‌రీల్

సంస్థాగతంగా పార్టీని పటిష్టం చేయాలి

బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ వి.మురళీధర్‌గౌడ్



హన్మకొండ: పార్టీని సంస్థాగతంగా మరింత పటిష్టం చేయాలని బీజేపీ హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ వి.మురళీధర్ గౌడ్, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. మంగళవారం హనుమకొడ దీన్‌దయాల్ నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా పదాధికారుల సమావేశంలో వారు మాట్లాడారు. పోలింగ్ బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, పోలింగ్ బూత్ స్వాశక్తీకరణ యోజన, ప్రధాని నరేంద్ర మోదీ మన్ కి బాత్ 100వ ఎపిసోడ్ కార్యక్రమంపై చర్చించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, రాష్ట్ర నాయకులు చాడ శ్రీనివాస్ రెడ్డి, పులి సరోత్తం రెడ్డి, కార్పొరేటర్ చాడ స్వాతి, జిల్లా ప్రధాన కార్యదర్శులు దేశిని సదానందం గౌడ్, అర్‌పీ జయంత్ లాల్, కందగట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిట్‌లో అగ్ని ప్రమాదం

లేడీస్ హాస్టల్‌లోని ఓ గదిలో ఘటన



కాజీపేట అర్బన్: వరంగల్ నిట్‌లోని లేడీస్ హాస్టల్ భవనం మొదటి అంతస్తులోని ఓ గదిలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు లేచాయి. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి హాస్టల్ భవనంలోని విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్‌కు గురై గదిలోకి మంటలు వ్యాపించాయి. విద్యార్థినుల పుస్తకాలు, దుస్తులు కాలిపోయాయి. ప్రమాద సమయంలో గదిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. సెక్యూరిటీ సిబ్బంది స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెనుప్రమాదం తప్పింది.

టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా జనార్దన్‌రెడ్డి



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ విభాగం ఇన్‌స్పెక్టర్‌గా జనార్దన్‌రెడ్డిని నియమిస్తూ సీపీ ఏవీ రంగనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా సీపీని కలిసి మొక్క అందించారు.

ప్రమోషన్ ట్రైనింగ్‌లో కమిషనరేట్ పోలీసుల ప్రతిభ



జి.శంకర్, తమిళ్ ఆనందం, మోహన కృష్ణ

వరంగల్ క్రైం: పోస్ట్ ప్రమోషన్ ట్రైనింగ్‌లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన హెడ్ కానిస్టేబుళ్లు సత్తా చాటారు. ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీనుంచి మార్చి 21వ తేదీ వరకు కరీంనగర్ పోలీస్ శిక్షణ కేంద్రంలో జరిగిన ట్రైనింగ్‌లో వరంగల్ కమిషనరేట్‌తోపాటు రాచకొండ, నల్లగొండ, సూర్యాపేట, వనపర్తి, మహబూబ్‌నగర్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలనుంచి సుమారు 860 మంది నూతన హెడ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. శిక్షణ అనంతరం అధికారులు నిర్వహించిన అవుట్‌డోర్, ఇండోర్ పరీక్షల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన హెడ్ కానిస్టేబుళ్లు అత్యధిక మార్కులు సాధించారు. ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి.శంకర్ 404 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలవగా, నర్సంపేటలో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ తమిళ్ ఆనందం 402 మార్కులతో రెండవ స్థానంలో, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పీఆర్‌ఓ మోహనకృష్ణ 392 మార్కులతో మూడవ స్థానంలో నిలిచాడు. ప్రతిభ కనబర్చిన హెడ్ కానిస్టేబుళ్లను వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ అభినందించారు.

'ఓపెన్' పరీక్షలు షురూ

విద్యారణ్యపురి: వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. హనుమకొండలోని ప్రభుత్వ హైస్కూల్, ప్రాక్టీసింగ్ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎం.శంకర్ రావు తనిఖీ చేశారు.

మారిన నేత్ర వైద్యశాల భోజన మెనూ

- స్పందించిన డీఎంఈ
- రోగులకు మెరుగైన ఆహారం

సాక్షి ఎఫెక్ట్

ఎంజీఎం: వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో అధ్వానంగా భోజనం సరఫరా చేస్తున్న తీరుపై 'ఐ'య్యో.. ఇదేం మెనూ' శీర్షికన సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి డెరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) స్థాయి అధికారి స్పందించారు. ఆస్పత్రిలో భోనం సరఫరా జరుగుతున్న తీరుపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గిరిధర్‌ను వివరణ కోరారు. అధికారులను మందలించడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం నూతన మెనూ అందుబాటులోకి వచ్చింది. మంగళవారం రోగులకు నాణ్యమైన భోజనం సరఫరా చేశారు. ఉదయం ఉప్మా మాత్రమే పెట్టే సదరు కాంట్రాక్టర్ ఉప్మాతోపాటు పాలును సైతం అందించారు. మధ్యాహ్న భోజనంలో ఆకుకూర పప్పు, టమాట, మజ్జిగ, గుడ్డు, అరటిపండు పెట్టారు. ఈ రోజు భోజనం బాగుందని పలువురు రోగులు పేర్కొన్నారు.





అరటిపండు, గుడ్డు, రెండు రకాల కూరలు, చారుతో వడ్డించిన భోజనం

నగరంలో భట్టి యాత్ర



నగరంలో పాదయాత్ర చేస్తున్న భట్టి విక్రమార్క, పక్కన పొన్నాల లక్ష్మయ్య, నాయిని రాజేందర్‌రెడ్డి

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర మంగళవారం వరంగల్ నగరంలో సాగింది. ఉదయం కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులతో కొంతసేపు ముఖాముఖి నిర్వహించిన భట్టి.. సాయంత్రం కేయూ జంక్షన్ నుంచి ఫాతిమానగర్‌కు చేరుకున్నారు. - వివరాలు 8లో▸

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా



మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

మడికొండ: కార్యకర్తలే తన బలం.. బలగం అని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. మంగళవారం మడికొండ శివారులోని సత్యగార్డెన్స్‌లో జరిగిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్లీనరీలో ముందుగా పార్టీ జెండాను ఎగురవేశారు. తెలంగాణ తల్లి పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన తన 30ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నానని, తనకు కార్యకర్తలే అండగా ఉన్నారన్నారు. కొంతమంది ప్రతిపక్ష పార్టీ నాయకులు చిల్లర రాజకీయాల కోసం ఏదో మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రలు చేస్తున్నారన్నారు. తాను చేసిన అభివృద్ధిపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. 'నాకు ఇతర ఎమ్మెల్యేల మాదిరిగా ఫామ్‌హౌజ్‌లు లేవు, మాతాత ఇచ్చిన ఇళ్లు, క్యాంప్ కార్యాలయం మాత్రమే ఉంది' అని అన్నారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, రైతు రుణవిమోచన చైర్మన్ నాగుర్ల వేంకటేశ్వర్‌రావు, మేయర్ గుండు సుధారాణి, గ్రంథాలయ చైర్మన్ అజీజ్‌ఖాన్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ హయాంలో సమగ్రాభివృద్ధి

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల: ఎన్నో పోరాటాలతో కొట్లాడి సాధించుకున్న రాష్ట్రానికి ఉద్యమ నాయకుడు కేసీఆర్ ముఖ్యమంత్రి కావడంతోనే అనతి కాలంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. పరకాల పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హాజరయ్యారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రసంగించారు. రైతు సంక్షేమం కోసం కేసీఆర్ నిరంతరం పరితపిస్తుండగా కేంద్ర ప్రభుత్వం అనేక కిరికిరిలు పెడుతూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. పోరాటాల గడ్డపై రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది నియోజకవర్గ ప్రజలకు సేవలు అందించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా 11వేల మందికి ఉపాధి అవకాశం కలుగుతుందన్నారు. ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం ఒక్క స్కీం ఇచ్చింది లేదన్నారు. తెలంగాణ వయస్సులో చిన్నదైనా అభివృద్ధిలో పెద్దగా ఉందన్నారు. అనంతరం 12 అంశాలను తీర్మానించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వరంగల్ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ బొల్లె భిక్షపతి, పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బండి సారంగపాణితోపాటు పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర, గీసుకొండ, సంగెం మండలాల బీఆర్ఎస్ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మండలాల అధ్యక్షులు, పరకాల బీఆర్ఎస్ కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

గోపాల్‌పూర్ పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సిక్తా

ఎల్కతుర్తి: ఆరోగ్య మహిళా కార్యక్రమం సందర్భంగా మండల కేంద్రంలోని గోపాల్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ మంగళవారం సందర్శించారు. 35సంవత్సరాలు నిండిన మహిళకు ఏర్పడే ఆనారోగ్య సమస్యలు, వారికి అందిస్తున్న చికిత్స వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వచ్చిన రిపోర్టుల ఆధారంగా అవసరమైన మందులతోపాటు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. మెరుగైన వైద్యం అవసరమైతే జిల్లా కేంద్రంలోని ఆస్పత్రులకు పంపించాలని సూచించారు. మంగళవారం 50మంది మహిళలు మాత్రమే రావడంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యాకూబ్ పాషా, తహసీల్దార్ రవిందర్ రెడ్డి, ఎంపీడీఓ తూర్పాటి సునీత, వైద్యురాలు డాక్టర్ శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

చెత్త రహిత నగరమే లక్ష్యంగా పనిచేద్దాం

- మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: చెత్త రహిత మహానగరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో పర్యావరణ ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. పారిశుద్ధ్యం, స్వచ్ఛ ఆటోలు, వాహనాల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గార్బేజి ఫ్రీ సిటీగా తీర్చిదిద్దడానికి పర్యావరణ ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగాలు శ్రమించాలన్నారు. శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం జవాన్లు, కార్మికుల పనితీరును పర్యవేక్షించాలన్నారు. మురుగు కాలువల నుంచి తొలగించిన వ్యర్థాలను కుప్పలుగా పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు. చెత్త కుండీల్లో చెత్త పేరుకుపోయి ఉంటే శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రేటర్ వ్యాప్తంగా అన్ని అంతర్గత నాలల పూడికతీత పనులు ప్రణాళిక ప్రకారం పక్షం రోజుల్లో పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సీఎంహెచ్‌ఓను ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌ఓ రాజేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించి సోనియాకు బహుమతిగా ఇద్దాం

● కార్నర్ మీటింగ్‌లో భట్టి విక్రమార్క



మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

కాజీపేట/మడికొండ : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సోనియాగాంధీకి బహుమతిగా ఇద్దామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం కాకతీయ యూనివర్సిటీ జంక్షన్‌నుంచి ప్రారంభమై గోపాలపురం క్రాస్‌రోడ్డు, సమ్మయ్యనగర్ మీదుగా గోకుల్‌నగర్, కలెక్టరేట్ నుంచి ఫాతిమానగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణను భ్రష్టు పట్టిస్తున్న కేసీఆర్‌ను ఓడించాలన్నారు. మాజీ ఎంపీ వీహెచ్ మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా పంట దిగుబడులను కోల్పోయి ఆచేతనంగా మిగిలిన రైతాంగాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో రాత్రి బస

భట్టి యాత్ర రాత్రి 9.30 గంటలకు మడికొండకు చేరుకుంది. వాసవిమాత కల్యాణ మంటపంలో రాత్రి బస చేశారు. బుధవారం ఉదయం 8 గంటలకు మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తారు. అక్కడినుంచి పాదయాత్ర ద్వారా మడికొండ చౌరస్తా, అంబేడ్కర్ విగ్రహం సెంటర్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు దగ్గరినుంచి ధర్మసాగర్ మండలానికి వెళ్తారని పార్టీ నేతలు తెలిపారు.

ఫ్యూడల్ వ్యవస్థ ఏర్పాటుకు కేసీఆర్ కుట్ర

● ప్రభుత్వ యూనివర్సిటీల నిర్వీర్యం
● సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
● కేయూలో నిరుద్యోగ విద్యార్థులతో ముఖాముఖి
● కష్టాలు, సమస్యలు చెప్పుకున్న విద్యార్థులు



విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

కేయూ క్యాంపస్: కొట్లాడి, సాధించుకున్న తెలంగాణలో ఫ్యూడల్ వ్యవస్థను పునర్నిర్మించేలా కేసీఆర్‌కుట్ర చేస్తున్నాడని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా మంగళవారం కాకతీయ యూనివర్సిటీలో నిరుద్యోగ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. తొలుత పలువురు నిరుద్యోగ విద్యార్థులు మాట్లాడుతూ తెలంగాణ వస్తే మాకు ఉద్యోగాలు వస్తాయని భావించామని కాని కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఉద్యోగాల భర్తీచేయలేదన్నారు. చివరికి ఇచ్చిన నోటిఫికేషన్లలో పేపర్ల లీకేజీతో పలు నోటిఫికేషన్లు రద్దుచేశారని అన్నారు. తాము కుటుంబాలకు దూరంగా ఉండి కష్టపడి చదుకుంటున్నామని యూనివర్సిటీల ప్రైవేటీకరణ, గ్రూప్ పేపర్ల లీకేజీ, గురుకుల పోస్టుల ఉద్యోగాల రిజర్వేషన్ల ఇబ్బందులు సమస్యలను విద్యార్థులు సీఎల్పీ నేత దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో కాకతీయ యూనివర్సిటీ ఒక పెద్ద వర్సిటీగా, ఎన్నో ఉద్యమాలకు, భావజాలాలకు, సామాజిక మార్పులకు వేదికగా నిలిచిందన్నారు. తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవం లేకుండా 70 ఏళ్లనాటి ఫ్యూడల్ వ్యవస్థను పునరుద్ధరించేలా బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. నీళ్లు లేవు.. నిధులు లేవు.. నియామకాలు లేకుండా చేశారు. ఖాళీగా ఉన్న 2లక్షల ఉద్యోగాలు, ప్రభుత్వరంగ సంస్థల్లోని ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయలేదన్నారు. తెలంగాణ లక్ష్యాలు నెరవేరేవరకూ విద్యార్థి లోకం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తొమ్మిదిన్నర ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క యూనివర్సిటీని కూడా కొత్తగా ఏర్పాటు చేయలేదన్నారు. ప్రభుత్వ వర్సిటీలను నిర్వీర్యం చేసే కుట్రను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోపించారు. ప్రైవేట్ యూనివర్సిటీలను మాత్రం ఏర్పాటు చేస్తుందన్నారు. రూ.5లక్షల కోట్ల అప్పులు చేసిన కేసీఆర్ ప్రభుత్వం కేసీఆర్ ఇంకా కొనసాగితే రాష్ట్రంలోని యూనివర్సిటీల భూములను కూడా అమ్మేస్తాడని ఎద్దేవా చేశారు. త్వరలో టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రపతికి లేఖ రాస్తానని చెప్పారు. పేపర్ లీకేజీలు చేసినా.. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయడం లేదన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే పోడెం వీరయ్య, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ తదితరులు మాట్లాడారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ ఉపాధ్యక్షుడు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కాంగ్రెస్ నాయకులు నమిండ్ల శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్‌రావు, శోభ, రవళిరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో కేయూ విద్యార్థి జాక్ కన్వీనర్ పర్లపెల్లి శ్రీశైలం, ఆలువాల కార్తిక్, బొట్ల మనోహర్, బండి రాకేష్, డాక్టర్ తీగల ప్రేమ్ సుందర్, హెచ్ భగత్, డాక్టర్ గజ్జెల మల్లేశ్, డాక్టర్ మంద వీరస్వామి, డాక్టర్ గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి, దేవరకొండ ఐలేష్, మధుకర్‌రావు, మంద నరేష్ ఇట్టబోయిన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కచ్చితమైన వాటా ఇవ్వాలి



గురుకులాల్లో ఉపాధ్యాయ పోస్టులలో 75శాతానికిపైగా మహిళలకే కేటాయించారు. పురుష అభ్యర్థులు నష్టపోతున్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే.. వారి కోటా వారికి ఇవ్వాల్సిందే. అదే విధానాన్ని చట్టసభల్లో కూడా కేసీఆర్ అమలు చేయాలి.

\- రాజశేఖర్, నిరుద్యోగ విద్యార్థి

రూ.5 భోజనం తింటూ చదువుతున్నాం



విద్యార్థుల లక్ష్యాన్ని కేసీఆర్ ప్రభుత్వం లక్షలకు అమ్ముకుంటోంది. రూ.5 భోజనం తింటూ.. చదువుకుని ఉద్యోగాలకు ప్రిపేరవుతున్నాం. రోస్టర్ పాయింట్లు చూస్తుంటే దడ పుడ్తోంది. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందే.. కానీ పురుషుల కోటా మాత్రం కచ్చితంగా అమలు చేయాలి.

\- దొంగ్రూ కచ్రూ, నిరుద్యోగ విద్యార్థి

నిట్‌లో కొలువుల సంబురం



క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో దుర్గాప్రసాద్, ఎన్వీ.రమణారావు

● ఉద్యోగ సాధనకు నిట్ అక్షయపాత్ర
● టెక్ మహీంద్ర సీటీఓ దుర్గాప్రసాద్
● 268 కంపెనీల్లో 1,410 మందికి ఉద్యోగాలు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో కొలువుల సంబురం మంగళవారం అంబరాన్నంటింది. నిట్ వరంగల్‌కు చెందిన 1,410 మంది విద్యార్థులు 268 కంపెనీల్లో ఫుల్ టైం ఎంప్లాయీస్‌గా ఉద్యోగాలు సాధించారు. నిట్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అక్షయ క్యాంపస్ సెలక్షన్స్ సక్సెస్ మీట్‌ను టెక్ మహేంద్ర సీటీఓ దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా ప్రారంభించి, మాట్లాడారు. తాను నిట్ వరంగల్‌లోనే బీటెక్ పూర్తి చేసి క్యాంపస్ సెలక్షన్స్‌లోనే ఉద్యోగం సాధించి నేడు టెక్ మహీంద్రా కంపెనీకి సీటీఓగా పని చేస్తున్నానని తెలిపారు. ఉత్తమ విద్యకు, అత్యుత్తమ ఉద్యోగ సాధనకు నిట్ వరంగల్ క్యాంపస్ అక్షయపాత్ర లాంటిందని కొనియాడారు. నిట్ వరంగల్‌లో విద్యనభ్యసించి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు నిట్ వరంగల్ గౌరవాన్ని ప్రపంచానికి చాటాలని తెలిపారు. నిట్ విద్యార్థులకు అత్యుత్తమ విద్యతోపాటు క్యాంపస్ సెలక్షన్స్‌కు సీసీపీడీ(సెంటర్ ఫర్ కెరీర్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్) ద్వారా ఉద్యోగాలను అందించేందుకు ప్రపంచంలోని కంపెనీలు పోటీపడుతున్నాయని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. నిట్ విద్యార్థుల ప్రతిభకు తార్కాణంగా నిట్‌కు చెందిన ఆదిత్య సింగ్ రూ.88లక్షల వార్షిక ప్యాకేజీకి సెలక్ట్ అవ్వడమేనని అన్నారు. నిట్ క్యాంపస్ సెలక్షన్స్‌లో ఫుల్ టైం ఎంప్లాయీస్‌గా ఉద్యోగాలు సాధించిన 1,410 మంది విద్యార్థులకు సీసీపీడీ క్యాంపస్ సెలక్షన్స్ పత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సీసీపీడీ హెచ్ డేవిడ్‌సన్, రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ విద్యాబోధనతోనే మంచి ప్యాకేజీ..



న్యూఢిల్లీలోని ఫరీదాబాద్ నుంచి నిట్ వరంగల్‌లో బీటెక్ సీఎస్ఈ కోసం వచ్చా. ఇక్కడి విద్యార్థుల పోటీతత్వంతో ప్రేరణ పొందాను. నిట్ అధ్యాపకుల ఉత్తమ బోధనతోనే క్యాంపస్ సెలక్షన్స్‌లో తోస్పాట్ బెంగుళూరుకు చెందిన కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రూ.88లక్షల వార్షిక ప్యాకేజీకి సెలెక్ట్ అయ్యాను.

\- ఆదిత్య సింగ్, సీఎస్ఈ, రూ.88లక్షల ప్యాకేజీ

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా..



నిట్ వరంగల్‌లో సీఎస్ఈ విభాగంలో బీటెక్ చదువుతున్న తరుణంలోనే సీసీపీడీ చొరవతో క్యాంపస్ సెలక్షన్స్‌కు ఎంపికయ్యాను. హైదరాబాద్‌కు చెందిన డీషా కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రూ.62.5లక్షల ప్యాకేజీకి ఎంపికవడం ఆనందంగా ఉంది.

\- సుషిత్‌రెడ్డి, సీఎస్ఈ, రూ.62.5లక్షలు

వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై స్టార్టప్ లక్ష్యం



నేను వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై స్టార్టప్ కంపెనీ ఏర్పాటు చేస్తాను. నిట్‌లో ఎంఎస్సీ మాథ్స్ పూర్తి చేశాను, పూనేలోని సిటీ బ్యాంక్‌లో రూ.12లక్షల వార్షిక ప్యాకేజీకి సెలెక్ట్ అయ్యాను. కంపెనీ పెట్టి మరింతమందికి ఉద్యోగాలివ్వడమే నా లక్ష్యం.

\- తానీయా అగర్వాల్, ఎంఎస్సీ (మ్యాథ్స్), రూ.12లక్షల ప్యాకేజీ

యూఎస్‌లో మాస్టర్స్ చేస్తా..



యూఎస్‌లో మాస్టర్స్ చేయడమే నాలక్ష్యం. నిట్‌లో ఈఈఈ విభాగంలో బీటెక్ పూర్తి చేస్తూనే క్యాంపస్ సెలక్షన్స్‌లో పాల్గొన్నాను. మా ప్రొఫెసర్స్ గైడెన్స్‌లో హైదరాబాద్‌కు చెందిన క్వాల్‌కామ్ కంపెనీలో రూ.29.7లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికవడం సంతోషంగా ఉంది.

\- రుచీరా, ఈఈఈ, రూ.29.7లక్షల ప్యాకేజీ

శ్రీభద్రకాళీభద్రేశ్వరుల కల్యాణోత్సవం



కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు



మంగళసూత్రం చూపిస్తున్న అర్చకులు

● సింహవాహనం, గజవాహనంపై ఊరేగింపు

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయంలో శ్రీభద్రకాళీభద్రేశ్వరుల కల్యాణం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఉదయం నుంచి శంకర జయంతి సందర్భంగా నిత్యాహ్నికం పూర్తి చేసి శంకరభగవాత్పాద సమారాధన జరిపారు. అనంతరం చతుస్థానార్చన నిర్వహించి అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి సింహ వాహనంపై ఊరేగించారు. సాయంత్రం గజవాహనంపై ఊరేగించారు. గ్రేటర్ వరంగల్ ఆర్యవైశ్య సంఘం ఉభయదాతలుగా వ్యవహరించారు. సంఘం అధ్యక్షులు గందె నవీన్, కల్పన దంపతులు, సభ్యులు పాల్గొన్నారు. రాత్రి శ్రీభద్రకాళీభద్రేశ్వరుల కల్యాణాన్ని శోభాయమానంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్‌కు చెందిన ప్రముఖ అద్వైత వేదాంత శాస్త్ర పండితులు మంగళంపల్లి వేణుగోపాలశర్మ శివకల్యాణ వైభవంపై పురాణ ప్రవచనం చేశారు. ఆలయ ఈఓ శేషు భారతి పర్యవేక్షించారు. రాత్రి 11 గంటల వరకు కల్యాణ వేడుకలు కొనసాగాయి. భక్తులకు ఉచిత భోజన ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీకాంతారావు, ఏసీ రామల సునీత పాల్గొన్నారు.

వరిధాన్యాన్ని కుప్పగా చేస్తూ కుప్పకూలిన రైతు

● చికిత్స పొందుతూ మృతి



వెంకట్‌రెడ్డి(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: ఆరబోసిన ధాన్యాన్ని వర్షానికి దగ్గరికి చేస్తుండగా కుప్పకూలి పడిపోయిన ఓ రైతు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నమిలిగొండ గ్రామానికి చెందిన రిక్కల వెంకట్‌రెడ్డి(60) తన వరి ధాన్యాన్ని అమ్మేందుకు గ్రామంలోని ఐకేపీ కేంద్రానికి తరలించి ఎండకు ఆరబెట్టాడు. ఈనెల 23న(ఆదివారం) సాయంత్రం వర్షం రావడంతో ధాన్యాన్ని దగ్గరగా కుప్ప చేసే క్రమంలో ఒక్కసారిగా కుప్ప కూలాడు. గమనించిన తోటి రైతులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మీ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కనిపించని ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం

● హనుమకొండ, వరంగల్‌లో వంద శాతం హాజరు
● టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో 90 శాతం హాజరు



ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్ద మోహరించిన పోలీసులు

హన్మకొండ: హనుమకొండ, వరంగల్ జిల్లాలో విద్యుత్ ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్, ఇత్తెహాద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ మంగళవారం నుంచి సమ్మెకు పిలుపునిచ్చాయి. ఇటీవల విద్యుత్ సంస్థల్లోని రెండు జేఏసీలతో వేతన సవరణ ఒప్పందంపై అసంతృప్తిగా ఉన్న ఈ రెండు యూనియన్లు యాజమాన్యాలకు సమ్మె నోటీసు ఇచ్చాయి. యాజమాన్యం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో సమ్మెకు వెళ్లాయి. కానీ, ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. మరో వైపు విద్యుత్ సంస్థల్లో సమ్మెను నిషేధాన్ని విధించింది. ఆర్టిజన్‌లు సమ్మెకు వెళ్తే ఎస్మా కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించాయి. ఈ క్రమంలో సమ్మె సందిగ్ధంలో పడ్డది. ఎక్కడ ఎస్మా ప్రయోగించి చర్యలు తీసుకుంటారో.. ఎక్కడ ఉద్యోగాలు ఊడిపోతాయోననే భయాందోళన మధ్య బలవంతంగా ఆర్టిజన్లు హాజరయ్యారు. ప్రధాన సంఘాల మద్దతు లభించకపోవడం కూడా ఆర్టిజన్లు వెనక్కు తగ్గడానికి కారణమని పలువురు ఉద్యోగులు తెలిపారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలో ఆర్టిజన్లు సమ్మెకు దూరంగా ఉన్నారు. ఈ రెండు జిల్లాలో వంద శాతం హాజరయ్యారని ఎన్పీడీసీఎల్ అధికారులు తెలిపారు. హనుమకొండ జిల్లాలో 189 మంది ఆర్టిజన్లు, వరంగల్ జిల్లాలో 183 మంది ఆర్టిజన్ ఉద్యోగులుండగా అందరు విధులకు హాజరయ్యారని అధికారులు తెలిపారు. వంద శాతం హాజరుతో జిల్లాలో విద్యుత్ సరఫరాపై ఎలాంటి ప్రభావం చూపలేదు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగింది. కాగా, టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో 90శాతం ఆర్టిజన్లు విధులకు హాజరైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో సమ్మె ప్రభావం కనిపించిందని తెలిపారు. ఇదిలా ఉండగా హనుమకొండలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యుత్ భవన్‌కు పోలీసు పహారా ఏర్పాటు చేశారు. కొత్త వ్యక్తులు ఎవరు వచ్చినా వారి వివరాలు తెసుకున్నాకే లోపలికి అనుమతించారు.

స్పౌజ్ టీచర్ల బదిలీలు చేపట్టండి



హనుమకొండ డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న స్పౌజ్ టీచర్లు

● హనుమకొండలో ర్యాలీ నిర్వహించిన టీచర్లు

విద్యారణ్యపురి: ఉమ్మడివరంగల్ జిల్లాలో ఇంకా బదిలీ కాని స్పౌజ్ టీచర్లు తమకు బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్పౌజ్ టీచర్ల ఫోరం ఆధ్వర్యంలో హనుమకొండలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. 317 జీఓ ద్వారా భర్త ఒక జిల్లా.. భార్య మరొక జిల్లాలో ఉంటూ అనేక ఇబ్బందులుపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 16 నెలలుగా నిరీక్షిస్తున్నామని తమ ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది స్కూల్ అసిస్టెంట్ల స్పౌజ్ టీచర్లకు బదిలీలు చేసినప్పటికీ మిగిలిన అందరినీ బదిలీ చేయాలని కోరారు. అలాగే ఎస్‌జీటీ కేటగిరి స్పౌజ్ టీచర్లకు ఇప్పటివరకు బదిలీలు చేపట్టలేదని తమ ఆవేదనను ప్లకార్డుల వెలిబుచ్చారు. హనుమకొండలోని డీఈఓ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ వరకు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రంను సమర్పించారు. ఈసందర్భంగా స్పౌజ్ టీచర్ల ఫోరం బాధ్యులు కందగట్ల సురేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి తమ మాటను నిలుపుకోవాలని కోరారు. వేణుగోపాల్, శ్రీనివాసస్వామి, శ్రీహరి, శరత్, రాంగోపాల్‌రెడ్డి, హుస్సేన్, రమాదేవి, చంద్రశేఖర్‌రెడ్డి, గౌసియా, హేమలత, శ్రీపాల్, నరిసయ్య, భాస్కర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు హనుమకొండ డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డీఈఓకు వినతిపత్రం అందజేశారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీకోర్సుల ఇయర్ వైజ్ బ్యాక్‌లాగ్, ఎక్స్ విద్యార్థుల పరీక్ష దరఖాస్తులు సమర్పించే గడువు మే 1వరకు పొడిగించినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ మధుకర్‌రావు, డాక్టర్ ఎ.నరేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు విశ్వవిద్యాలయం అకాడమిక్ బ్రాంచీలో ఒక్కో సబ్జెక్టుకు రూ.3వేల చొప్పున ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి అనుమతి పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీంతోపాటు సబ్జెక్టుకు రూ.4వేల చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాల్సింటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

బతుకుదెరువు కోసం వెళ్తూ..

● రోడ్డు ప్రమాదంలో తాత మృతి, మనుమడికి గాయాలు



ప్రమాదస్థలిలో సైదులు మృతదేహం

దేవరుప్పుల : బతుకు దెరువు కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ తాత చనిపోగా, మనుమడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రానికి చెందిన తాతమనుమళ్లు చినబత్తుల సైదులు(75), తిరుపతి ఆయుర్వేద మందుల వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలోనే మంగళవారం సూర్యాపేట– జనగామ రహదారి గుండా మహారాష్ట్రకు మారుతీ వ్యాన్‌లో వెళ్తుండగా సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలోని ధారావత్‌తండా పరిధిలో వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టారు. ఈ ఘటనలో సైదులు అక్కడికక్కడే మృతిచెందగా.. మనుమడు తిరుపతి కాళ్లు విరిగి తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. సైదులు కుమారుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైల్వే డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

● రైల్వే సంఘ్ సికింద్రాబాద్ డీఎస్ భుజంగరావు



నూతన కార్యవర్గం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డ్రైవర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ (డీఎస్) డి.భుజంగరావు అన్నారు. కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో మంగళవారం రైల్వే సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచీ 10వ జనరల్ బాడీ, నూతన కార్యవర్గం ఎంపికలో భుజంగరావు మాట్లాడారు. ఎస్ఎఫ్ఐఆర్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.రాఘవయ్య నేతృత్వంలో రైల్వే డ్రైవర్ల పెండింగ్ సమస్యల పరిష్కారానికి రైల్వే బోర్డు స్థాయిలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైల్వే డీఎంఓ డాక్టర్ హరినాథ్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో డ్రైవర్లు, అసిస్టెంట్ డ్రైవర్లు ఆరోగ్యంగా జాగత్తగా ఉండాలని పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం రైల్వే సంఘ్ ఎంప్లాయీస్ సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కె.రవి, వర్కింగ్ చైర్మన్‌గా పాక రాజ్‌కుమార్, వైస్ చైర్మన్లుగా శృతి, జి.లక్ష్మీయనారాయణ, గుప్తా, సెక్రటరీగా చింత మురళి, అసిస్టెంట్ సెక్రటరీలుగా జి.వరప్రసాద్ రెడ్డి, మేరుగు శివ, సీహెచ్.పరమేశం, ట్రెజరర్‌గా పి.సుధాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ్ కేంద్ర కమిటీ సభ్యులు వి.మురళీకృష్ణ, ఎస్.వెంకటనారాయణ, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.